# ఏది న్యాయం

ఈ మధ్య తరచూ నా భార్య అదోలా ఉండటం చూసి నేను ఆశ్చర్యపోయాను. ఎప్పుడూ— అప్పుడే వికసించిన పారిజాత పుష్పంలా ఉండే నా భార్య చలాకితనాన్ని శృంగారంతో మిళితం చేసి నన్ను సమ్మోహితుడ్ని చేసే నా భార్య— నాకు ఏ చిన్న కష్టం కలిగినా, ఏడుస్తూ కనిపించని దేవుళ్ళందర్నీ మొక్కుకునే నా భార్య దిగులుగా, ఏదో పోగొట్టుకున్న దానిలా ఉంటే... నాకు మనశ్శాంతి ఎలా వుంటుంది? నాకు తెలిసినంత వరకు మా ఇద్దరి మధ్య ఎటువంటి గొడవలు లేవు.

— ఆఖరికి బెడ్‌రూమ్‌లో కూడా!

ఆ రోజు రాత్రి 10 గంటల సమయం. ఆకాశం మరి నక్షత్రాలు మౌనంగా కదులుతున్నాయి. నాకు నిద్రరావడం లేదు. మనసును కలచివేస్తున్న అశాంతి. తలత్రిప్పి చూశాను. ప్రక్క బెడ్ మీద నా భార్య మూడేళ్ళ నా ముద్దుల కూతురు నిద్ర పోతున్నాను. నేను చిన్నగా లేచి నా భార్యను తట్టిలేపాను. కొద్దిసేపు ప్రయత్నంతోనే మేలు కుంది. దుప్పటిని కూతురు మీద కప్పి నా బెడ్ మీదకు చేరుకుంది. బెడ్ లైట్ వెలుగులో కూడా నా భార్య ముఖం జీవకళను కోల్పోయి కళావిహీనంగా కనిపిస్తుంది.

అదే బెడ్ మీద పదిరోజుల క్రిందట ఆ బెడ్‌రూమ్‌కే మహారాణిలా మసలిన నా భార్య ఇప్పుడూ— ఒక యజమాని దగ్గర ఒక జీతగాడు చేసి పెట్టే పనిలా... భర్తన్న వాడికి ఒక భార్య అందించే కనీసం సుఖం అందించటానికన్నట్టు ఉన్న నా భార్యను చూసి ఇక తట్టుకోలేక పోయాను. రెండు చేతులతో హృదయానికి దగ్గరగా తీసుకొని అన్నాను.

"ఏమైంది నీకు? ఎందుకలా ఉన్నావు? నావల్ల ఏదైనా పొరపాటు జరిగితే చెప్పు. అంతేకాని, నీలో నువ్వు కుమిలి పోతే నాకెలా తెలుస్తుంది. నాకు తెలియకుండా కూడా నేను ఏదైనా పొరపాటు చేసి ఉండవచ్చు. అదేదో చెపితే కదా! నాకర్థమయ్యేది."

ఆ చిన్న ఓదార్పుకే తట్టుకోలేనట్టుగా ఎక్కి ఎక్కి ఏడవటం మొదలు పెట్టింది. ఆ వెక్కిళ్ళ మధ్యే చెప్పసాగింది.

"మీకు తెలియకుండా కాదు. మీకు తెలిసే తప్పు చేస్తున్నారు."

"ఏం చేస్తున్నాను?" అర్థం కాని అయోమయంతో అడిగాను.

"మీకు ఇంకో అమ్మాయితో సంబంధం ఉంది."

నా రెండు చేతులు చిన్నగా వణికాయి. ఇన్నాళ్ళు ఏ విషయమైతే తెలియకూడదనుకున్నానో అదే విషయం తెలిసింది. చిన్నగా కంఠాన్ని స్వాధీనంలోకి తెచ్చుకుంటూ అన్నాను.

"ఛ!ఛ!! ఎవరో మనం సుఖంగా ఉండటం చూసి సహించలేక నీతోటి అలా చెప్పి ఉంటారు. నిజానికి నాకు ఏ స్త్రీతోటి సంబంధం లేదు."

ఇక్కడ ఒక విషయం గమనించాలి. మనం ఒక తప్పు చేస్తాం. ఆ వెధవ తప్పును కప్పిపుచ్చుకోవటానికి చాలా మందిని వెధవల్ని చేస్తుంటాం.

ఆ మాటలు నా భార్య నమ్మలేదు సరికదా! ఏడుపును... అదే ఏడుపు కూడా కాదు— ఆవేదన! భరించలేని ఆవేదన కలిగినప్పుడే కన్నీళ్ళొస్తాయి.

కన్నీళ్ళను శత విధాలుగా ఆపుకోవాలని ప్రయత్నిస్తూ అంది— "ఎవరో చెపితే నేనెందుకు నమ్ముతాను. నేనే చూశాను. ఒక బాబును ఎత్తుకొని ఉన్న అమ్మాయిని మీరు స్కూటర్ మీద తీసుకెళ్ళటం నేను కళ్ళారా చూశాను."

"నేను సర్ది చెప్పటానికి కష్ట పడుతుండగా మళ్ళీ తనే అంది— "జరిగిందేదో జరిగిపోయింది. ఇక నుంచి మీరు ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళకూడదూ అసలు ఆ అమ్మాయి గురించి ఆలోచించకూడదూ!"

ఆ సమయంలో నా భార్యతో ఎలా చెప్పేది? నువ్వంటే నాకెంతో ఇష్టమో... ఆ అమ్మాయి కూడా అంతే ఇష్టమని. నేను మౌనముగా తలవూపాను.

అలా తల వూపటం నా మంచితనం అనుకున్నాయో లేక నా భార్య అమాయకత్వాన్ని చూసో తెలియదు కాని కదులుతున్న నక్షత్రాలు చీకటితో కలిసి ఫక్కున నవ్వాయి.

★ ★ ★ ★ ★ ★

ఆ తర్వాత వారం రోజులు నేను ఆఫీస్ వదలగానే నా భార్య సమక్షంలో ఉండేవాడ్ని. మా ఇద్దరి మధ్య ఇప్పుడు ఏ కలతలు లేవు. ఇదివరకటి మల్లే నా భార్య సంతోషంగా ఉంటుంది. బహుశా! ఆ సంతోషం తన భర్త తన మాట వింటాడని, తన కోసం అందర్నీ వదులుకోగలడు అనే నమ్మకం వల్ల వచ్చి ఉంటుంది. కాని, నేనలా ఎంత కాలమని ఉండగలను?

పది రోజుల తర్వాత ఒక రోజు రాత్రి రెండు గంటలకు ఇంటికొచ్చాను. మళ్ళీ నా భార్య నిరాసక్తత! ఇది వరకు ఆలస్యంగా వెళ్ళి ఏవేవో కుంటిసాకులు చెప్పేవాడ్ని. ఇప్పుడు నేనెలా చెప్పగలను? చెప్పినా నా భార్య ఎలా నమ్మగలదు? ఏదో ఈ ప్రపంచమంతా తనను మోసం చేసినట్టు నిద్రిస్తున్న కూతురితో చెప్పుకోని చెప్పుకోని ఆ రాత్రంతా ఏడుస్తూ ఏ తెల్లవారు జామునో నిద్రపోయింది.

భర్తే సర్వస్వం అని భావించి జీవిస్తున్న ఒక ఇల్లాలు అలా బాధ పడటంలో ఆశ్చర్యమేముంది? ఇక లాభం లేదని నేనొక నిర్ణయానికొచ్చి ఒక తెల్లకాగితం మీద రాయటం మొదలు పెట్టాను.

"శృతీ!"

తెలిసీ తెలియని వయసులో రూపం తెలియని ఒకమ్మాయి గురించి కలలు కనేవాడ్ని. అదేమి విచిత్రమో.. అన్నీ తెలిసిన ఈ వయసులో ఇద్దరు స్త్రీలతో కాపురం చేయాల్సి వచ్చింది. ఈ లోకం నాకంటే దురదృష్టవంతుడు ఉండవచ్చు. కాని, దురదృష్టవంతుడ్నని ఎవరూ చెప్పుకోరు.

—నేను చెపుతున్నాను. నేను దురదృష్టవంతుడ్ని.

నిజం శృతీ!

నిన్ను పెళ్ళి చేసుకోక ముందే నేనొక అమ్మాయిని ప్రేమించాను. కులాలు మా ప్రేమను సమాధి చేసాయి. ఆ అమ్మాయి పెళ్ళి ఇంకొకరితో జరిగింది. ఆ తర్వాత నా పెళ్ళి, ఇదిగో... నీతో జరిగింది.

జరిగిన దాని గురించి నేనెప్పుడు బాధపడలేదు. అసలు ఆలోచించనే లేదు. దేవుడిచ్చిన వరానివి నువ్వు. అయితే... ఆ దేవుడే మన జీవితాలతో వెర్రిగా ఆడుకున్నాడు. నీకింతటి మనస్తాపాన్ని కలిగించిన ఆ అమ్మాయి భర్త కారు యాక్సిడెంట్‌లో చనిపోయాడు.

ఒక రోజు రైల్వే స్టేషన్‌లో చూశాను.

# మహర్షి



నిన్ను పెళ్ళి చేసుకున్న తర్వాత నేనొక అమ్మాయిని 'హృదయేశ్వరి' అని పిలవకుండా ఆపగలనేమో కాని, హృదయంలో కలిగే అలజడిని అణుచుకోగలనా? మేమిద్దరం గుళ్ళో దండలు మార్చుకున్నాం. ఇప్పుడు మా ఇద్దరికి ఒక బాబు. నువ్వు చూపిన బాటే అతను. ఇప్పుడు వాళ్ళిద్దరికి నేను తప్ప మరెవరు లేరు.

ఇప్పుడు చెప్పు శ్రుతి! వాళ్ళిద్దర్ని వదిలి పెట్టమంటావా? నువ్వు చెప్పితే నేనే పని చెయ్యటానికైనా సిద్ధమే! ఇన్నాళ్ళు మనసు పొరల్లో కలిగే సంఘర్షణతో ఎంతో అలసి పోయాను శ్రుతి! ఇప్పుడు నాకు చాలా ఆనందముగా వుంది. నా ఆవేదన నీతో పంచుకున్న భావన తాలూకు ఆనందం అది. ఆ ఆనందం అలాగే ఉంచుతావని కోరుకుంటూ...

ని గుణశేఖర్

నల్లటి నీడ ఏదో కదిలినట్టు అనిపించి తల త్రిప్పి చూసాను. నా ఆవేదనను అర్థం చేసుకున్నట్టుగా కన్నీళ్ళతో నిలబడి ఉంది నా భార్య శ్రుతి! నేనలాగే మౌనముగా నిలబడ్డాను. కిటికీ నుంచి చూస్తే కనిపించే చీకటి స్థిరంగా ఉంది. నా ఈ అనిర్వచనీయ భావం నుంచి దూరం చేయటానికన్నట్టు ఒక అడుగు ముందుకు వేసి నన్ను తన హృదయంకేసి హత్తుకుంది. నేను నిశ్చింతంగా కళ్ళు మూసుకుని అనుకున్నాను. "బాబు! ఈ జన్మకిది చాలు!!" అదే సమయంలో నా భార్య కూడా అలాగే అనుకున్నట్టు భగవంతుడొక్కడికే తెలుసు.

తెల్లచీరలో నుదుటి మీద బొట్టు లేకుండా... ఏమి సాంప్రదాయం శ్రుతి ఇది? పెళ్ళి అయ్యే వరకు రంగురంగులతో తిరిగిన అమ్మాయిని భర్తపోగానే దిష్టి బొమ్మలా తయారు చేయటం?